www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023





సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్‌రామ్

కలెక్టర్ విజయరామరాజు 6లో

కమనీయం.. రమణీయం





- వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి
- భారీగా తరలివచ్చిన ప్రజానీకం
- యాత్రికులతో కిక్కిరిసిన ఒంటిమిట్ట
- ఆధ్యాత్మిక శోభతో పరవశించిన ఏకశిలానగరి



సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న మంత్రి రోజా, టిటిడి చైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



శ్రీసీతారాముల తాళిబొట్లు, కంఠాభరణాలు

దేశంలోనే రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణం భక్త జనసందోహం, శ్రీరామ నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని పౌర్ణమి పండు వెన్నెల్లో తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సేవకులు పెద్దఎత్తున విచ్చేశారు. కడప-చెన్నయ్ ప్రధాన రహదారికి సమీపంలోని విశాలమైన మైదానంలో ఆకాశమంత చలువ పందిళ్లు వేసి పలు రకాల పూల పరిమళాలు, విద్యుత్ కాంతులు, భక్తుల కోలాటాలు, విద్యుత్ దీపాలంకారణలతో కూడిన కల్యాణ వేదిక వైకుంఠాన్ని తలపించింది. అంతకు ముందు సీతారాములవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపం వద్ద ఆసీనులను చేశారు. వేదపండితులు ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక ప్రాంగణం నుంచి వీనుల విందుగా సాగిన వ్యాఖ్యానాలు, ప్రవచనాలు ప్రజలను తన్మయులను చేశాయి. కల్యాణ వేదిక ప్రాంగణంలో పలుచోట్ల ఎల్ఇడి తెరలను ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి ఏర్పాట్లు చేశారు. తమ వంశం గొప్పదని తమ వంశమే గొప్పదని కొంత మంది వేద పండితులు సీతమ్మ వైపు, శ్రీరాముల వారి వైపు మరికొందరుచేరి వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. టిటిడి అధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

శ్రీకోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగదభిరాముని కల్యాణానికి ప్రభుత్వం తరఫున ముఖ్యఅతిథిగా హాజరైన గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. తరువాత వారికి ఆలయ విశిష్ట, రాములవారి ప్రశస్త్యం, సీతారాములకు చేయించిన ఆభరణాల గురించి వివరించారు. శ్రీసీతారాముల విగ్రహాల శిరముపై జీలకర్ర, బెల్లం పెట్టారు. ఈ మహాద్భుత సన్నివేశాన్ని వేదపండితులు ప్రజానీకానికి చూపించి సీతమ్మ వారి మెడలో మగళసూత్రాన్ని ధరింపజేశారు. ఈ మహాద్భుత దృశ్యాన్ని చూసి తరించేందుకు విచ్చేసిన భక్తులు జైశ్రీరామా అనే రామనామ స్మరణలతో కల్యాణ వేదిక, కోదండరామాలయ పరిసర ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం తలంబ్రాల కౌంటర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. ఏకశిలానగరిలో కోదండ రాముడి కల్యాణానికి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ, మంత్రి రోజా, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

భారీగా తరలి వచ్చిన భక్తజనం

సాయంత్రం 5 గంటల నుండి భక్తజనం భారీగా తరలివచ్చారు. ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటు చూసిన భక్తులతోనే నిండి ఉంది. సాయంత్రం ఆరు గంటలకే జనంతో నిండ పోయింది. చాలా మంది ప్రాంగణం బయట, హైవే రోడ్డుపై నిలిచి అక్కడ టిటిడి ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్‌లలో కళ్యాణ ఉత్సవాన్ని తిలకించి తరించారు



శివధనుర్భాలంకారంలో శ్రీరాముడు

ముత్యాల తలంబ్రాలుకు ఎగబడ్డ జనం

స్వామివారి కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం తలంబ్రాలు పంపిణీ చేసింది.. వీటికోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసింది. కౌంటర్ల వద్ద జనం ఎగబడ్డారు. ఒక దశలో జనం తలంబ్రాలు పొందేందుకు తోసుకున్నారు. పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు

అన్నదానం, మజ్జిగ పంపిణీ

కల్యాణం సందర్భంగా విచ్చేసిన భక్తులకు టిటిడి, పలు ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు అన్నదానం నిర్వహించాయి. కల్యాణ వేదికలో టిటిడి వారు మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు పంపిణీ చేశారు.

శివధనుర్బాలంకారంలో కోదండరాముడు

ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివ ధనుర్బాలంకారంలో రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భజనల బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శనంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్జీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



భారీ జనసంద్రంతో నిండిన కల్యాణ వేదిక

తహశీల్దార్‌ను బెదిరించిన జడ్‌పిటిసి

దురుసుగా వ్యవహరించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కడప జిల్లా బ్రహ్మం గారిమఠం తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డిని అధికార పార్టీకి చెందిన జడ్‌పిటిసి రామ గోవింద్‌రెడ్డి బెదిరించారు. ఆయనతో పాటు పలువురు సర్పంచ్‌లు, వైసిపి నాయకులు బుధవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారంలో ఉండేది వైసిపినేనని తాము తలుచుకుంటే ఐదు నిమిషాలలో బదిలీ చేయించగలమంటూ బెదిరించారు. ప్రభుత్వ నిధులతో తహశీల్దార్ కార్యాలయానికి జరుగుతున్న మరమ్మతు పనులను ఆపేయాలంటూ బెదిరించారు. మండల మెజిస్ట్రేట్‌తో ఎలా మాట్లాడాలో కూడా తెలియకుండా ప్రజాప్రతినిధులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించారని తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి మీడియాకు తెలిపారు. అసైన్‌మెంట్ భూముల విషయంలో తనను ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిపానన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఆదునికీకరణకు డబ్బులు వసూల్ చేశామని ఆరోపిస్తున్న దాంట్లో వాస్తవం లేదన్నారు. ఎవరినీ అడగలేదు, బలవంత వసూలుకు పాల్పడలేదన్నారు. స్వచ్ఛందంగా మన్యం శంకర్‌రెడ్డి అనే వ్యక్తి రూ.25 వేలు ఇచ్చారన్నారు. జడ్‌పి టిసి రామగోవింద్‌రెడ్డిని కూడా సాయం చేయమని అధికామన్నారు. కాగా అసైన్‌మెంట్ కమిటీకి రామగోవింద్‌రెడ్డి కొన్ని బోగస్ పేర్లు ఇస్తే తహశీల్దార్ ఆ పేర్లను తొలగించినట్లు సమాచారం. పేర్లు తొలగించారనే నెపంతో తహశీల్దార్‌ను బెదిరించారని మండలంలో ప్రచారం ఉంది. ఈ విషయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది.



మాట్లాడుతున్న తహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి

మతోన్మాద విధానాలను ఎండగట్టాలి

- 14 నుంచి 30 వరకు రాజకీయ ప్రచార యాత్రలు
- సిపిఎం, సిపిఐ కడప జిల్లా కార్యదర్శులు వెల్లడి

ప్రజాశక్తి- కడప అర్బన్

బిజెపి కార్పొరేట్ మతోన్మాద విధానాలను ప్రజలలో ఎండగట్టాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, జి చంద్ర అన్నారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఎల్. నాగ సుబ్బారెడ్డి అధ్యక్షతన సిపిఐ, సిపిఎం కడప జిల్లా కమిటీల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీల నిర్ణయాల మేరకు జిల్లాలోని 36 మండలాలలో రాజకీయ ప్రచార యాత్రల కార్యక్రమాలను ఈనెల 14 నుంచి 30 వరకు సభలు బహిరంగ సభలో ఉమ్మడిగా రూపొంచామని చెప్పారు. సభలకు సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు నిర్ణయించిన తేదీలలో ఆయా ప్రాంతాలలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల భారాలు వేస్తున్నాయని విమర్శించారు. కేరళ వామపక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలు దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను మంటగలుపుతోందని విమర్శించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాదుల్లా, సిపిఎం నగర కమిటీ సభ్యులు ఫరూక్ హుస్సేన్, ఓబులేసు, సిపిఐ నాయకులు వల్ల రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు

'కట్టా' సేవలు విస్మరింపరానివి : విసి

కడప అర్బన్ : సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టు సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, బాధ్యులుగా, సలహామండలి సభ్యులుగా విద్వాన్ కట్టా నరసింహులు అందించిన సేవలు విస్మరింపరానివని వైవీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జింక రంగ జనార్దన పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కట్టా నరసింహులు 76వ జయంతిని నిర్వహించారు. కట్టా నరసింహులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ కట్టా నరసింహులుకు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంతో విడదీయరాని బంధం ఉందని చెప్పారు. డాక్టర్ జానుమద్ది హనుమచ్ఛాస్త్రితో కలిసి గ్రంథాలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు పి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నూరు

మహిళల అభివృద్ధే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా మూడోవిడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం మహిళలకు ఆసర చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సికె దిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజనేయులు, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, వైసిపి మండల కన్వీనర్ ఎన్. భాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఆర్(చిన్న) అడవి శాఖ డైరెక్టర్ రమణ శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఎర్రసైన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** పట్టణంలో వైఎస్ ఆర్ ఆసరా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి మాట్లాడుతూ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతలుగా ఆసర మొత్తాన్ని అందజేశారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధా మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు ఎక్కువ ప్రాధాన్య ఇవ్వడం ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేలు పారిపోతారని వర్క్‌షాపు : టిడిపి

కడప అర్బన్ : ఎమ్మెల్యేలు ఎక్కడ పారిపోతారోనని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్క్ షాప్ పెట్టారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుల శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బుధవారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి రాష్ట్ర ప్రజలంతా జగన్ననే మన రాష్ట్రానికి అంధకారమని మాట్లాడుకుంటున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్లల్లో లక్ష కోట్ల అప్పులు చేసి కూడా ఒకటవ తేది జీతాలు ఇచ్చే పరిస్థితి నుంచి బయటకు రాలేక ఉన్నారని చెప్పారు. ఇటీవల రూ 6.500 కోట్లతో ఆసరా అనే కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారభినించి గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. అత్తారింటికి కొత్త అల్లుడు వచ్చినట్లు సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తేనే వాలంటరీ ఉద్యోగాలు ఇచ్చి, ఎన్నికల హామీలన్నీ నెరవేర్చారనీ సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లల్లో నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు, ఎన్ని నోటిఫికేషన్లు విడుదల చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, నగర మాజీ అధ్యక్షుడు జిలానీబాష పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలబడండి

కడప అర్బన్ : తొమ్మిదేళ్ల ఎన్‌డిఎ పాలనలో కార్పొరేట్లకు సౌభాగ్యం, పేదలకు దారిద్ర్యం దక్కాయని, ఈ పరిస్థితి పోవాలంటే ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యమని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్త పిలుపుమేరకు స్థానిక ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో దేశంలో జిడిపి పతనమైందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అదుపు తప్పాయన్నారు. ఎల్‌ఐసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థ మార్కెట్ లీడర్‌గా విజృంభిస్తున్నా, వాటిని బలహీనపరిచే ప్రయత్నమే కేంద్రం చేస్తోందని అన్నారు. వ్యవసాయం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీమా ప్రీమియంలపై జిఎస్‌టిని రద్దు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో పెన్షనర్స్ కార్యదర్శి సుధీకర్, యూనియన్ నాయకులు అమీనా పర్వీన్, రాజు, అయ్యవారు రెడ్డి, శ్రీకృష్ణ, కుమార్, నజీరుల్లా, చంద్ర, నరసయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హరిరామజోగయ్య జన్మదిన వేడుకలు

కడప అర్బన్ : నగరంలోని శంకరాపురంలో బుధవారం కాపు సంక్షేమ సేన కడప జిల్లా కార్యాలయంలో కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి హరి రామజోగయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.వి. రమణ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలను భవిష్యత్తులో మరెన్నో జరుపు కోవాలని రాష్ట్రంలోని బలిజ, కాపు, తెలగ ఒంటరి కులస్తుల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. అనంతరం డాక్టర్ అక్కిశెట్టి స్నేహ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు.

'అసమ్మతి' అవాస్తవం : వైసిపి

కడప : పత్రికల్లో తమపై వచ్చిన వార్తలు అవాస్తవమని కమలాపురం వైసిపి నాయకులు వంశీధర్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కడప వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిపైనా, తనపైన వచ్చినా వార్తల్లో నిజం లేదన్నారు. తాను భూమి కొనుగోలు చేసిన సందర్భంగా ఇటీవల బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, టిడిపిలో ఉన్న అత్యంత సన్నిహితులకు విందు ఏర్పాటు చేశానని తెలిపారు. దీన్ని రాజకీయం చేసి ఎమ్మెల్యేపై అసమ్మతి అనే అవాస్తవు వార్తలు వచ్చాయని పేర్కొన్నారు.

సలహా మండలి సభ్యురాలిగా వినోదిని

కడప అర్బన్ : వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదాసు వినోదిని కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులుగా నియమితులయ్యారు. దశాబ్ద కాలంగా కరువు ప్రాంతమైన రాయలసీమలోని కడప జిల్లా యోగివేమన యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా వేలాది మంది విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే విధంగా కృషి చేశారు. సమాజంలో జరిగే అనేక సమస్యలను వస్తువుగా తీసుకుని పరిశోదాత్మకమైన వ్యాసాలను రచించారు. కథలలోనూ కవిత్వంలోనూ, వ్యాసాలలోను ఎప్పటికప్పుడు తనదైన రచన శైలితో పాఠకులను చైతన్యం చేస్తున్నారు.

బిఒఎస్ సభ్యులుగా డాక్టర్ మృత్యుంజయరావు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం, లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ద్రావిడ యూనివర్సిటీలో జానపద, గిరిజన అధ్యయనాల విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు గా నియమితులయ్యారు. ఈయన సభ్యులుగా మూడేళ్లు ఉంటారు. లలితకళా రంగంలో సిలబస్ రూపకల్పనలోని విశేష అనుభవమున్న డాక్టర్ మృత్యుంజయరావు దాదాపు 45 వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళలపై పరిశోధనా వ్యాసాలను, పుస్తకాలను ప్రచురించారు. ఈ సందర్భంగా మృత్యుంజయ రావు మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయం అధికారులకు, ఆవిభాగం అధిపతి ఆచార్య డి శ్యామలకి కృతజ్ఞతలు తెలిపారు.

డిఇఒను సత్కరించిన 'రూట' నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన వై. రాఘవరెడ్డిని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహిదుల్లా, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాకీమ్ సాహెబ్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్ లు బుధవారం విద్యాశాఖాధికారి కార్యాలయం లో ఘనంగా సత్కరించారు. రూట డైరీ, క్యాలండర్లు బహూకరించారు కార్యక్రమంలో కడప జిల్లా హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రూట రాష్ట్ర డైరీ కమిటీ కో- చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అఫ్జల్ బాషా, రాష్ట్ర అకాడమిక్ రివ్యూ కన్వీనర్ షాహబుద్దీన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జుబైర్ అహ్మద్, నగర శాఖ అధ్యక్షులు అలి అక్బర్ పాల్గొన్నారు.



డిఇఒను సన్మానిస్తున్న రూట నాయకులు

గర్భిణీకి రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని గణేష్ నగర్‌కు చెందిన అన్నపూర్ణ అనే గర్భిణి ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించగా ట్రస్ట్ వ్యవ స్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి, పేరమ్మ గారి పల్లె గ్రామానికి చెందిన చింతా సురేష్ చే పాజిటివ్ రక్తం దానం చేయించారు.ఈ సందర్భంగా సంస్థ పౌండర్ రసూల్ ప్రసాద్ అడిగిన వెంటనే రక్త దానం చేసి మహిళ ప్రాణాలను కాపాడినందుకు సురేష్‌ను ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్, బంధు మిత్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రుద్రా శ్రీకాంత్, సిపిఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

మాతృభాషను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాతృభాష సంరక్షించుకొనే క్రమంలో తెలుగు భాష అమలుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ .తవ్వా వెంకటయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులుగా నియమితులయ్యాక తమ రాష్ట్ర అధ్యక్షులు పి.విజయ బాబు సూచన మేరకు బుధవారం కలెక్టర్ విజయరామరాజును కలిశారు. జిల్లాలో ప్రభుత్వేతర ఆస్పత్రులు, పాఠశాలలు, హోటళ్లు, దుకాణాలు పేర్లను ఆంగ్లంతోపాటు తెలుగుభాషలోనూ ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి , తెలుగు ఉపాధ్యాయులు డా. సాయి ప్రసాద్ ఉన్నారు. అనంతరం కలెక్టర్‌కు తవ్వా వెంకటయ్య తన రచనలను అందజేశారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత వీణా వియరామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు వీణా విజయరామరాజు అని మాజీ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వీణా విజయరామరాజు వర్ధంతి, బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ సంఘ నాయకుడిగా, ఎమ్మెల్సీగా నిరంతరం విద్యారంగం అభివృద్ధి కోసం వీణా విజయరామరాజు కృషి చేశారన్నారు. పేద ,బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని నమ్మిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి, సిపిఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మల్లీశ్వరరెడ్డికి ఉత్తమ గురుదేవోభవ అవార్డు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

గుంటూరులోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన అమరావతి జాతీయస్థాయి ఒలంపియాడ్ -4 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఆలిండియా హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ మల్లీశ్వరరెడ్డి ఉత్తమ గురుదేవోభవ అవార్డు అందుకున్నారు,.జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, అమరావతి ఒలింపియాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మణరావు, హ్యాండ్‌రైటింగ్ అసోసియేషన్ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి హుసేన్ చేతుల మీదుగా అవార్డు, మెమొంటోను తీసుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇచ్చి పరీక్షలో ఉత్తమార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు.



అవార్డును అందుకుంటున్న మల్లీశ్వరరెడ్డి

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్ : కలెక్టర్



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - కడప/ కడప అర్బన్

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక కోసం పోరాడి వివక్షతను జయించిన సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు కొనియాడారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు మహవీర్ సర్కిల్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో జెసి సాయికాంత్‌వర్మ, సాంఘిక సంక్షేమశాఖ జెడి జయప్రకాష్, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ల ఇడి డాక్టర్ వెంకటసుబ్బయ్య హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆశయస్ఫూర్తితో జిల్లాలో సుస్థిర అభివృద్ధి కోసం అధికారులు పాటుపడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు జి.వి. రమణ, జాతీయ బిసి మహాసభ కార్యకర్త అవ్వారు మల్లికార్జున అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఎస్‌పి కార్యాలయంలో..** ఎస్‌పి అన్బురాజన్ జగ్జీవన్‌రామ్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి రమణయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **సిపిఎం ఆధ్వర్యంలో..** సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మహబీర్ సర్కిల్‌లో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం వచ్చాక 8 సార్లు పార్లమెంట్ సభ్యుడిగా, కార్మిక శాఖ కేబినేట్ మంత్రిగా పనిచేసినా సాధారణ కార్యకర్తలు తనకు ఉత్తరాలు రాస్తే ప్రత్యుత్తరం స్వయంగా రాసి పంపే వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, షారుక్ హుసేన్ పాల్గొన్నారు. **డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో..** జగ్జీవన్‌రామ్ విగ్రహానికి డివైఎఫ్ఐ జిల్లా , నగర కార్యదర్శులు వీరనాల శివకుమార్, డి.ఎం. ఓబుఎలసు, రాజ్‌కుమార్, సొహైల్ పూల మాల వేసి నివాళులర్పించారు. **ఉపముఖ్యమంత్రి, మేయర్ ఆధ్వర్యంలో...** ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు మహవీర్ సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **వైసిపి కార్యాలయంలో..** ఎస్‌సి సెల్ అధ్యక్షులు చైతన్య ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి, మేయర్, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో..** జిల్లా అధ్యక్షులు నీలిశ్రీనివాసరావు, నగర అధ్యక్షులు విష్ణుప్రీతమ్‌రెడ్డి , ఎస్‌సిసెల్ అధ్యక్షులు గొర్లశ్రీనివాసులు, మల్లం విజయభాస్కర్, చీకటి చార్లెస్, శ్యామలదేవి, చెప్పలి పుల్లయ్య, మధురెడ్డి, మామిళ్ల బాబు కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పాత రిమ్స్‌లోని మానసిక వికలాంగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో ఎస్టీఫ్ జనరల్ సెక్రటరీ సుబ్బరాజు యాదవ్, నాయకులు శ్రీనివాసులు, రవిశంకర్, వెంకటేశ్వర్లు, సలాం, రామచంద్ర, సాగర్, విజయ్ కుమార్, ప్రసాద్, బాబా పీర్, నిత్య ప్రభాకర్ పాల్గొన్నారు. **ఆంధ్రప్రదేశ్ బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో..** రాష్ట్ర అధ్యక్షులు నాగమల్లేష్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపి బిసి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.గోపాల్, రాష్ట్ర ట్రెజరర్ ఎస్. ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు గోచి ఎల్లయ్య యాదవ్, ఉపాధ్యక్షులు శివశంకర్, సలహాదారులు సి. వీర భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. **సికెదిన్నె :** దేశ తొలి ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలోమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శిల్పకళ, లావణ్య, ప్రశాంతి, మహేష్ బాబు, సాయి మహేశ్వరి, మానస, స్వామి చైతన్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రామలక్ష్మి, ప్రత్యూష పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి ఒద్దెపోగు యోహాను, జిల్లా కన్వీనర్ చిన్నఓబీగాండ్ల ఓబయ్య జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో, యర్రబల్లె ప్రసాదరావు, దళిత వేదిక బద్వేలు నియోజకవర్గ అధ్యక్షులు కొండయ్య, మద్దూరి ఏసురత్నం, కాశినాయన మండల కన్వీనర్ పి ఓబయ్య, జాలా నరసింహులు, విజయకుమార్ పోరుమామిళ్ల ముండ్లపాటి, కె.ప్రకాశం పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** వివక్షతను జయించిన సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగ్జీవన్ రామ్ మార్గంలో నడవాలన్నారు. జాతీయ నాయకుల వర్ధంతి, జయంతి నిర్వహించడం వల్ల వారు చేసిన సేవలను భావితరాలకు అందించవచ్చన్నారు. ఇది మనందరి బాధ్యతని ఆయన వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, 10వ వార్డ్ కౌన్సిలర్ సలోమి, డైరెక్టర్ మార్బుల్ శీను, నాయకులు కిరణ్‌కుమార్, వేణు యాదవ్, దళిత నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** బాబు జగ్జీవన్ రామ్ గొప్ప స్వతంత్ర సమరయోధుడని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని కాంగ్రెస్, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు రామాంజనేయులు, టిడిపి నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. ఎంపిపి లక్ష్మి గాయత్రి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు బిందెల రామాంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, వైసిపి ఎస్‌సి మండల కన్వీనర్ కమతం రాజా, యుగంధర్, ఈశ్వరయ్య, ఆర్‌వి రమేష్, పుల్లయ్య, వెంకటయ్య, రవికుమార్, ఉత్తన్న, టీచర్ రఘు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగాధర్‌రెడ్డి, డక్కా రమేష్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధృవకుమార్‌రెడ్డి, శివ, రామకృష్ణ పాల్గొన్నారు. **ముద్దనూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, గంగరాజు, రమణ, ఓబులేసు, వెంకటస్వామి, రామకృష్ణ, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, సమతావాది, తొలి దళిత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ జయంతిని స్థానికంగా ఎంఇఎఫ్, మహాజన సోషలిస్టు పార్టీ, టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. నివాళులర్పించినవారిలో ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచికె. బాబు, ఎంఎస్ఎఫ్ జంగాల మునిస్వామి, టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి, పొన్నతోట శ్రీను, జాంబపురం రమణారెడ్డి, వివిధ సంఘాల నాయకులు ప్రదీప్, శీను, సాల్మన్, పుట్ట ఓబులేసు, ఆంజనేయులు, శివ నారాయణ, మల్లప్ప, చింతాకు రాముడు, ఓబయ్య పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని భాకరాపురంలో ఉన్న సిఎం క్యాంపు కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. **బ్రహ్మంగారిమఠం :** బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మానవత్వాన్ని చాటిన డాక్టర్ లక్ష్మీప్రియ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



రక్తదానం చేస్తున్న డాక్టర్ లక్ష్మీప్రియ


పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రిలో బుధవారం ఓ మహిళ గర్భ సంచి శస్త్ర చికిత్స కోసం ఎ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో ఆస్పత్రి వైద్యులు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీప్రియ స్పందించి రక్త దానం చేశారు. రక్తదానం చేసి ఆమె మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రియ మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తం ఎక్కువ అవసరం ఉంటుందన్నారు. యువకులు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావలసిన ఆమె పిలుపునిచ్చారు.

నేడు జగనన్న ఇంటి నిర్మాణాలపై సమీక్ష

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాల పురోగతిపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాసేవ అభినందనీయం

పులివెందుల రూరల్ : పురపాలక 4వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ కిషోర్ ప్రజలకు చేసే సేవలు మరువలేనివని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి సౌజన్యంతో కిషోర్ తన తల్లి పార్వతి బాలమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన డాక్టర్ జిసి గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు ఒఖారి రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, విజయ్ కుమార్ నాయుడు, లక్ష్మి భార్గవి, శాంతమ్మ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని బాలాజీ క్లాత్ మార్కెట్ దగ్గర కొనిరెడ్డి ఫౌం డేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతల ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని ప్రశంసించారు. వైసిపి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు నరకం

ఎర్రగుంట్ల : వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు నరకం కనబడుతోందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చరిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. మండలం కోడూరు గ్రామపంచాయతీలో బుధవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల పార్టీ బాధ్యులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి. రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి కొండయ్య యాదవ్. రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సూర్య పెద్దరాజు. కోడూరు పార్టీ నాయకులు శివశంకర్‌రెడ్డి, ఓబులేసు, మల్లికార్జున్‌రెడ్డి, బండి శివశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళపై దాడి : ఏడుగురిపై కేసు నమోదు

ముద్దనూరు : స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లో ఉంటున్న యామవరం మేరీ ఇంట్లో చొరబడి మహిళలపై దాడి చేసి గాయపరిచిన కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేరీ ఇంటి సమీపంలో ధారా రాధ నివాసం ఉంటున్నారు. మేరీ అక్క కొడుకు చైతన్య హర్షవర్ధన్ రాధను చూసి నవ్వాడని ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి గొడవ పడ్డారు. మళ్లీ అదేరాత్రి మేరీ తన ఇంటి ముందు కూర్చుని ఉండగా రాధ, ఆమె భర్త సురేష్, ప్రసాద్, బోనం ప్రవీణ్, పద్మావతి, సరోజ, లాజరు అనే వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. ఇంట్లో చొరబడి మేరీ తల్లి విజయమ్మ, అక్క కళావతి, చెల్లెలు మణిని అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితురాలు మేరీ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

ఎర్రగుంట్ల : స్థానిక కడప రోడ్డులోని క్రాంతినగర్ ప్రాంతంలో నూతన నిర్మాణానికి అవసరమైన మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో జెసిబితో ట్రాక్టర్, మట్టిని పక్కకు తీశారు.

అభివృద్ధికి టిడిపి అడ్డంకి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణంలో అభివృద్ధి పనులకు టిడిపి నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. అలాంటి నాయకులను తెలుసుకుని వారికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు. పట్టణంలోని 10వ వార్డులో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల టెండర్లలో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు పాల్గొని, ఆ పనులను చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని మున్సిపల్ అధికారులు గుర్తించి అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో 9,10వ వార్డులకు దాదాపు 500 ఇళ్ల పట్టాలను మంజూరు చేయించామన్నారు. గత పాలకులు ప్రజల ముంగిటికి వచ్చి వారి సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజల సమస్యలను వింటూ ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల చైర్ పర్సన్ బడిగింజల విజయలక్ష్మి,10వ వార్డ్ కౌన్సిలర్ ఎ.సలోమి, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, డైరెక్టర్ మార్బుల్ శీను, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, రిషికేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చాంద్ బాబా అలీ, వేణు యాదవ్, హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, డిఇ బాల మల్లేష్, విద్యుత్ ఎఇ, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కార్మికులకు అండగా నిలవాలి

జమ్మలమడుగు రూరల్ : తొమ్మిదేళ్ల ఎన్‌డిఎ పాలనలో కార్పొరేట్లకు సౌభాగ్యం, పేదలకు దారిద్ర్యం దక్కాయని ఈ పరిస్థితి పోవాలంటే ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జమ్మలమడుగు బ్రాంచి ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ అన్నారు. దేశవ్యాప్త పిలుపుమేరకు బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం ఎదుట అధ్యక్షులు వై.కళ్యాణ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సతీష్, నరసింహులు, మోహన్‌రెడ్డి, నాగరాజు, రామయ్య, ప్రభావతమ్మ, రామచంద్రరావు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ఎర్రగుంట్ల : మండలంలోని వై.కోడూరు గ్రామ మాజీ సర్పంచు దాసరి నారాయణరెడ్డి (డిఎన్ఆర్) కుమారులు దాసరి రామచంద్రారెడ్డి, దాసరి రాజశేఖర్‌రెడ్డి, సున్నపురాళ్లపల్లి మాజీ సొసైటీ ప్రెసిడెంట్ దాసరి రాజారెడ్డి వారి అనుచరవర్గంతోసహా 20 కుటుంబాలు బుధవారం టిడిపిలో చేరాయి. వీరికి జమ్మలమడుగు పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఎన్నికల్లో విజయం మాదే : ప్రవీణ్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాబోవు 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ద్వారకనగర్‌లో బుధవారం ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోడెల బాబురెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.